క్లుప్తంగా

12న భవిష్య నిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయంలో ఈనెల 12వ తేదీన భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ డాక్టర్ హేమంత్ తెలిపారు.కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్ టెర్మినల్‌లోని రెండో అంతస్తులోని కార్యాలయానికి ఖాతాదారులు రావాలన్నారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్‌ఈఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ఖాతాదారులు పాల్గొవచ్చన్నారు.

రేపు జేఈఈ మెయిన్స్ అవగాహన సదస్సు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వెంకట్రావునగర్ కమ్యూనిటీహాల్‌లో ఈనెల 11న గురు అకాడమీ ఆధ్వర్యంలో జేఈఈ మెయిన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ రమేష్ నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జేఈఈ, మెయిన్స్‌కు ఎలా సన్నద్ధం కావాలి.. ఏ పుస్తకాలు చదవాలి.. రోజుకి ఎన్ని గంటలు చదవాలి.. ఏ కాన్సెప్ట్ నేర్చుకోవాలి.. అభ్యర్థి ఆలోచన విధానం ఎలా ఉండాలి? అనే విషయాల మీద అవగాహన కల్పిస్తారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సదస్సు కొనసాగుతుందన్నారు.

వరద నీటి కాల్వ పనులను త్వరగా పూర్తి చేయాలి

• ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నందమూరి నగర్ కాలనీలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో పడుతున్న వరద నీటి కాల్వ నిర్మాణ పనులను చేపడుతున్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శుక్రవారం అధికారులతో కలిసి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వరద నీటి కాల్వ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజీవ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహదేవ్, డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రశాంతి, నాయకులు రాజేందర్, ప్రసాద్, అంజయ్య, కోటిరెడ్డి, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ


కూకట్‌పల్లి: డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీలో సుమారు రూ.24లక్షలతో సీసీరోడ్డు పనులను చేపట్టారు. కార్పొరేటర్ జూపల్లి సత్యనారాణ శుక్రవారం అధికారులతో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నాగేశ్వర రావు, అబ్బులు, సత్యనారాయణ, కొండరెడ్డి, రఫీక్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


రోజాదేవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సినీనటుడు మురళీ మోహన్

కేపీహెచ్‌బీకాలనీ: బాలాజీనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి సాయిబాబు చౌదరి సతీమణి రోజాదేవి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సినీ నటుడు, మాజీ ఎంపీ మురళీ మోహన్ శుక్రవారం సాయిబాబు చౌదరిని పరామర్శించారు. ఈ సందర్భంగా రోజాదేవి చిత్రపటానికి నివాళులర్పించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి ప్రాంతంలో శుక్రవారం ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. అతని వివరాల కోసం ఆరా తీయగా స్థానికంగా భిక్షాటన చేసేవాడని, వడదెబ్బతో మృతి చెంది ఉంటాడని పోలీసులు పేర్కొంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలో వార్డు కార్యాలయాలు ప్రారంభం

మోతీనగర్: ప్రజలకు చేరువలో సేవలందించడానికి ప్రభుత్వం వార్డు స్థాయి పరిపాలనకు అన్నీ సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే వార్డు కార్యాలయాలను అందుకు అనుగుణంగా తీర్చిదిద్దే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. అల్లాపూర్, మూసాపేట డివిజన్‌లలో వార్డు కార్యాలయాల ఏర్పాటుకు విస్తృత సన్నాహాలు చేపడుతున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రారంభించడానికి పనులు వేగవంతంగా చేస్తున్నారు. అల్లాపూర్, మోతీనగర్ ప్రాంత వాసులు ఏ చిన్న పని ఉన్నా సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న మూసాపేట సర్కిల్ కార్యాలయానికి వెళ్ల వలసిందే. దాంతో అక్కడికి వెళ్లినా సంబంధిత సిబ్బంది అందుబాటులో లేకపోతే ఇబ్బందులకు గురి కావాల్సిందే. అప్పటి కూడా సంబంధిత అధికారులు కలవకపోతే నిరాశ చెంది ప్రయత్నాన్ని విరమించుకోవాల్సిన పరిస్థితి కలుగుతోంది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని ఎక్కడికక్కడ డివిజన్‌లలో వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోంది.

◆ వార్డు కార్యాలయంలో ప్రధానంగా వార్డు టౌన్ ప్లానింగ్, విద్యుత్, మంచినీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, పన్నులు, బిల్లుల చెల్లింపు విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారు. వీరందరికి ఏఎంసీ ఉన్నతాధికారిగా వ్యవహరిస్తారు.

◆ ప్రజలకు పాలనను దగ్గర చేసేందుకు వీలుగా ఈ వార్డు కార్యాలయాలు దోహదపడతాయి. డివిజన్‌లో ఏర్పాటు చేస్తున్న ఈ వార్డు కార్యాలయాల్లో ఆ వార్డుకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండటంతో సమస్య చెప్పుకొని, పరిష్కరించుకునేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుంది.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మూసాపేట వార్డు కార్యాలయం, కార్యాలయం లోపల ఫర్నిచర్

◆ అధికారులు అందుబాటులో లేని సమయంలో ఫిర్యాదులు సైతం స్వీకరించడానికి ఫిర్యాదు బాక్స్ కూడా ఏర్పాటు చేస్తున్నారు.

◆ వార్డు కార్యాలయం ఏర్పాటు కానుండటంతో ఆయా బస్తీ, కాలనీల్లో సత్వరమే సమస్యలు పరిష్కారమవుతాయని సంక్షేమ సంఘాల సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ చిన్న సమస్య ఉన్నా మూసాపేట సర్కిల్ కార్యాలయానికి వెళ్ల వలసి వచ్చేది. నేడు ఆ పరిస్థితికి స్వస్తి చెప్పి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అన్ని విభాగాల అధికారులు అందుబాటులోఉండటం శుభ పరిణామమని స్థానికులు పేర్కొంటున్నారు.

హర్షించదగ్గ విషయం



వార్డు కార్యాలయం డివిజన్ పరిధిలో ఏర్పాటు చేయటం హర్షించదగ్గ విషయం. అంతేకాకుండా జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటూ డివిజన్ సమస్యలను పరిష్కరించటానికి ఎంతో దోహదపడుతుంది. ప్రజలకు కూడా అధికారులను కలిసి వారి సమస్యలు చెప్పుకొని తక్కువ సమయంలో పరిష్కరించుకోవచ్చును.

– ఎం సుదర్శన్‌రావు గుప్తా, గాయత్రినగర్

నేడు 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన

• ముఖ్యఅతిథిగా రాన్ను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు
• శంకుస్థాపన పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


కేపీహెచ్‌బీ 5వ ఫేజులోని ఆస్పత్రి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: ఆసియాలోనే అతి పెద్ద కాలనీగా పేరొందిన కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో నాలుగు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న 100 పడకల ఆస్పత్రికి మోక్షం లభించింది. ఎంతోమంది పాలకులు 100 పడకల ఆసుపత్రిని తీసుకువస్తామని హామీలు ఇచ్చినప్పటికి నెరవేరని స్వప్నం నేడు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కృషితో సాకారం కానుంది. నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో దశాబ్ది ఉత్సవాల సాక్షిగా హౌసింగ్ బోర్డు కాలనీలో 100 పడకల ఆసుపత్రి శంకుస్థాపనకు శ్రీకారం చుట్టారు.

◆ హౌసింగ్ బోర్డు లే అవుట్‌లో 5వ ఫేజులో కేటాయించిన 1.17 ఎకరాల స్థలంలో సుమారు 58 కోట్ల రూపాయల ప్రాథమిక అంచనా వ్యయంతో ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. శనివారం ఉదయం 9.30 గంటలకు తెలంగాణ ఆరోగ్య శాఖామంత్రివర్యులు తన్నీరు హరీష్‌రావు, నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శాసనమండలి సభ్యులు కె. నవీన్‌కుమార్, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు.

విరించి సిల్క్స్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీ వేదికగా విరించి ఫ్యాషన్స్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన విరించి సిల్క్స్‌ను శ్రీకర్ణులు జగద్గురువు విశాఖ శ్రీశారదా పీఠాధీశ్వరులు శ్రీస్వరూపానందేంద్రస్వామి ప్రారంభించారు. శుక్రవారం జరిగిన ఈ ప్రారంభ వేడుకల్లో నిర్వాహకులు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఆషాఢ మాసాన్ని దృష్టిలో ఉంచుకొని వివాహాలు తదితర శుభకార్యాలకు అవసరమైన ఫ్యాషన్ డిజైన్స్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, కస్టమర్లు పాల్గొన్నారు.



నా స్థలం నాకు ఇప్పించాలి

ముఖ్యమంత్రి స్పందించాలని బాధితురాలు విజ్ఞప్తి

పంజగుట్ట: తమ స్థలం కబ్జాచేయడమే కాకుండా.. సెల్‌ఫోన్, కారులో ఉన్న నగదు, విలువైన పత్రాలు ఎత్తుకెళ్లి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వృద్ధురాలు ఎం.పుష్పవతి ఆవేదన వ్యక్తం చేసింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాను శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్‌నగర్ సర్వే నం.100లో 3వేల ఎకరాల స్థలాన్ని 2006లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. తన వద్ద అన్ని పత్రాలు ఉన్నాయన్నారు. తనస్థలంపై కన్నేసిన స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, అతని అనుచరులైన స్థానిక కార్పొరేటర్, బస్తీ నాయకులు తన స్థలం కబ్జాచేసేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్‌లో ఎమ్మెల్యే అనుచరులు తమ స్థలంలోకి ప్రవేశించారన్నారు. అక్కడున్న వారిపై దాడి చేసి ఖరీదైన సెల్‌ఫోన్, 1.20 లక్షల నగదు, విలువైన పత్రాలు అన్ని ఎత్తుకెళ్లారని తెలిపారు. బూతులు తిడుతూ తన స్థలం నుంచే తనను బయటకు నెట్టేశారని తెలిపారు.

◆ గత నెల 13వ తేదీన తిరిగి తన స్థలంలో 30 ట్రాక్టర్ల మట్టిని పోసి చుట్టూ ఉన్న హద్దురాళ్లను తొలగించి కబ్జాకు యత్నించారని తెలిపారు. జీహెచ్‌ఎంసీ వారు సర్వే చేసి ఈ స్థలం తనదే అని నిర్ధారించారని అయినా ఎమ్మెల్యే, అతని అనుచరులు దౌర్జన్యం చేస్తున్నారన్నారు. తాను ఒంటరి మహిళని, భర్త చనిపోయాడు, ఇద్దరు ఆడపిల్లలు పెళ్లి చేసుకుని అమెరికాలో ఉంటున్నారని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ స్పందించి తన స్థలం తనకు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో న్యాయవాది శివశంకర్, సీహెచ్ బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.



స్థలంలోకి ఎమ్మెల్యే అక్రమంగా ప్రవేశించిన ఫొటోలు చూపుతున్న బాధితురాలు

ఆరోపణలను ఖండిస్తున్నా: ఎమ్మెల్యే

సాక్షి, సిటీబ్యూరో: ఓ స్థల వివాదం విషయంలో తనపై వస్తున్న ఆరోపణలను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఖండించారు. ఎవరైతే ఆరోపణలు చేస్తున్నారో వారే తన వద్దకు వచ్చి వారి స్థలంలో రౌడీలు వచ్చి బీభత్సం చేస్తున్నారంటే ఓ ప్రజాప్రతినిధిగా తాను అక్కడకు వెళ్లానన్నారు. పోలీసు, రెవెన్యూ సిబ్బందికి వాస్తవాలను తేల్చాలని సూచించానన్నారు.

ఆ తర్వాత తనపై కావాలనే ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. తనపై ఆరోపణలు చేస్తున్న మహిళ నకిలీ స్టాంప్ పేపర్లు సృష్టించి ప్రజాప్రతినిధులపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. ఆ స్థలానికి తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

నేటి రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి

ఆల్విన్‌కాలనీ: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పాపిరెడ్డినగర్‌లో ఆర్‌ఎంసీ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు కాలనీ అధ్యక్షుడు చంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీవీరాంజనేయ శివాలయం ప్రాంగణంలో కమిటీ హాల్‌లో ఉదయం 7గంటలకు శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. ఈ రక్తదాన శిబిరాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్, కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. అదే విధంగా ఆశ్రయ్, ఆకృతి స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినికిడి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఫ్లెక్సీలు తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బందిపై దాడి

• కేసు నమోదు చేసిన కూకట్‌పల్లి పోలీసులు


దాడిలో గాయపడిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది

భాగ్యనగర్‌కాలనీ: రోడ్డుపై వెలిసిన బ్యానర్లను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బందిపై అధికార పార్టీకి చెందిన కొందరు దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఈ నెల 5వ తేదీన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు రాత్రి సమయంలో రోడ్డుపై ఉన్న ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకే ఫ్లెక్సీలు తొలగిస్తున్నామని ఎంత చెప్పినా వినకుండా దాడికి పాల్పడినట్లు జీహెచ్‌ఎంసీ సిబ్బంది పేర్కొన్నారు. తమపై దాడికి పాల్పడిన సీహెచ్ ప్రభాకర్, సంతోష్‌కుమార్ అతడి స్నేహితులపై తగిన చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేస్తాం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌లో రూ.95 లక్షల వ్యయంతో చేపట్టనున్న కాంపౌండ్ వాల్, పార్కు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. పెండింగ్‌లో పనులను సైతం త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబిహాబేగం, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, అబ్దుల్ హమీద్, జ్ఞానేశ్వర్, సంపత్‌రెడ్డి, నూర్‌ఖాన్, రఫిక్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఢిల్లీ నుంచి గల్లీ వరకు బీజేపీకి పోటీ లేదు


రవికుమార్‌యాదవ్ పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

భాగ్యనగర్‌కాలనీ: గడప గడపకు బీజేపీ రవన్న ప్రజాయాత్రలో భాగంగా శుక్రవారం శాతవాహన కాలనీ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీజేపీ పార్టీకి ఢిల్లీ నుంచి గల్లీ వరకు ఎక్కడ పోటీ లేదన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని రాబోయే రోజుల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు, డివిజన్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఇంటింటికి బీజేపీ భరోసా పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని పార్టీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని మల్లికార్జుననగర్ రోడ్డు నంబర్ 3లోని నల్ల పోచమ్మ దేవాలయం నుంచి పాదయాత్రను ప్రారంభించారు. యాత్ర రెయిన్‌బో స్కూల్, ఆనంద్‌నగర్ కాలనీ, హెచ్‌ఎఎల్ పార్కు వరకు సాగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ నాయకులు సూర్యారావు, శరన్, పప్పుపటేల్, తిరుపతి, సంతోష్‌గౌడ్, సత్యమూర్తి, అమర్‌గౌడ్, రఘు, లక్ష్మి, తులసి, వాణి, కార్తీక్, అభిషేక్, అరవింద్, సాయిచరణ్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్‌వెస్ట్‌లో రూ.15లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను చేపట్టారు. ఈ పనులను శుక్రవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేష్‌చంద్ర, నాయకులు శివరాజ్‌గౌడ్, నాగేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత...

ఎల్లమ్మబండ డివిజన్ పరిధిలోని మహవీర్ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రాంచందర్ తల్లి రాములమ్మ అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీవీజీ ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు స్నోక్ల శ్రీనివాస్, వెంకట్‌నాయక్, రాములుగౌడ్, వీరేశం, హరీష్, వెంకటేష్, కటిక రవి తదితరులు ఉన్నారు.


సాయినగర్ వెస్ట్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

బడిబాట



జనతానగర్‌లో ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మూసాపేట: మూసాపేట జనతానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. జనతానగర్, వడ్డెరబస్తీ, తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్యతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాఠాలు బోధిస్తారని తెలిపారు. యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటివి ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 44వేల మందికి సంక్షేమ పథకాలు అందాయి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లిలో జరిగిన సంక్షేమ సంబురాల కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లిలో సంక్షేమ సంబురాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై 118 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూకట్‌పల్లి నియోజకవర్గంలో 44 వేల మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందజేశామని తెలిపారు. కూకట్‌పల్లిలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు తాగటానికి మంచినీరు లేక నరకయాతన అనుభవించేవారని అన్నారు. అలాంటిది కూకట్‌పల్లిలో ఇంటింటికీ నీటిని అందించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే చెందుతుందన్నారు. అదే విధంగా కరెంటును 24 గంటలు అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు.

◆ ప్రపంచ దేశాలు సైతం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని చూసి పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నాయని అన్నారు. ఒకవైపు సాఫ్ట్‌వేర్ కంపెనీలు, మరోవైపు పరిశ్రమల ద్వారా లక్షల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత మంత్రి కేటీఆర్‌కే దక్కుతుందన్నారు. అబద్ధాలతో పబ్బం గడుపుకునే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఏనాడైనా పేదల గురించి పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. గ్యాస్ సిలిండర్ ధరలు, పెట్రో డీజిల్ ధరలు పెంచుతూ బీజేపీ ప్రభుత్వం పేదల కడుపు కొడుతోందన్నారు. అలాంటి పార్టీని రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఎమ్మార్వోలు గోవర్ధన్, అహల్య, డీసీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా చెరువుల పండుగ...

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఊరూరా చెరువుల పండుగను నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి రంగధాముని చెరువు వద్ద సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెలే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో కాకతీయ రాజులు గొలుసుకట్టు విధానంతో ప్రతి గ్రామాన చెరువులు, కుంటలను తవ్వించి తాగు, సాగు నీటిని అందించారని అన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణ ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ చెరువలన్నిటికి ఒక మహర్దశ వచ్చిందన్నారు. మిషన్ కాకతీయ ద్వారా కొన్ని వేల కోట్లను కేటాయించి చెరువులను పునరుద్ధరించి భూగర్భ నీటి లభ్యతను పెంచి సాగునీటిని అందివ్వటం జరిగిందని తెలిపారు. భూగర్భ జలాలు పెరగడంతో తెలంగాణ నేడు దేశంలోనే అత్యధిక దిగుబడులు ఇచ్చే రాష్ట్రంగా మారిందన్నారు. కూకట్‌పల్లిలోని అన్ని చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయించామన్నారు. రానున్న రోజుల్లో మరింత సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.


దశాబ్ది ఉత్సవంలో పాల్గొన్న ప్రజలు